శృంగేరి ఆలయంలో ఇకపై డ్రెస్ కోడ్

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు జిల్లాలోని శృంగే రి శారదామాత ఆలయంలో డ్రెస్ కోడ్‌లో అమలులోకి రానుంది. దక్షిణకన్నడ, చిక్క మగళూరు, ఉడుపి జిల్లాల్లోని ఆలయాల దర్శనాలకు దేశ విదేశీయులు వ స్తుం టారు. ఈ ప్రాంతంలోని పలు ఆలయాల్లో ఇప్పటికే సంప్రదాయ దుస్తులు పాటించే విధానం ఉంది. తాజాగా శృంగేరి ఆలయంలోనూ దర్శనాలకు పురుషులు ధోవతి, శాలువా, మహిళలు చీర, సల్వార్‌కమీజ్, దుప్పట్టా, లెహంగా, లంగాఓణీ వంటి సంప్రదాయ దుస్తులు మాత్రమే అనుమతిస్తామని శృంగేరి శారదామఠం ప్ర కటించింది. ఈ నిబంధనలు ఆగస్టు 15 నుంచి అమలులోకి తెస్తామని తెలిపింది.

నిండుకుండలా జలాశయాలు


కొడగు ప్రాంతంలో వంతెనపై ప్రవహిస్తున్న నీరు


వరదనీటితో కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం


నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయం రోడ్డు జలమయం

ఆల్మట్టి నుంచి లక్ష క్యూసెక్కుల విడుదల

ఆల్మట్టి జలాశయం నుంచి ఈ ఏడాది తొలిసారిగా 26 గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కుల నీటిని శనివారం మధ్యాహ్నం నదికి విడుదల చేశారు. కృష్ణ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఆల్మట్టి గరిష్ఠ నీటిమట్టం 519.6 మీటర్లు కాగా 518 మీటర్లకు నీరు చేరింది.

వరుణుడి కృపతో తమిళనాడుకు భారీగా నీరు: సీఎం

రాష్ట్రంలో ఉత్తమంగా వర్షాలు కురుస్తున్నాయని తమిళనాడుకు కావేరి నీరు భారీగా వదులుతున్నామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో కేఆర్ఎస్ పూర్తిగా నిండనుందన్నారు. తమిళనాడు కోటాకు అనుగుణంగా నీరు విడుదల చేస్తామని పేర్కొన్నారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిరూరు ప్రాంతంలో కేంద్రమంత్రి కుమారస్వామి పర్యటనపై అభ్యంతరం లేదని, ఇప్పటికే రాష్ట్రమంత్రులు మంకాళ వైద్య, కృష్ణబైరేగౌడ సందర్శించారని తెలిపారు.

- భారీగా పెరిగిన నీటిమట్టం
- కావేరి నుంచి లక్ష క్యూసెక్కుల విడుదలకు ఏర్పాట్లు
- ఆల్మట్టి నుంచి లక్ష క్యూసెక్కుల విడుదల
- వరుణుడి కృపతో తమిళనాడుకు భారీగా నీరు : సీఎం

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంతోపాటు కావేరి నదీతీరంలో నిరంతరంగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు నిండుకుండలా మారాయి. కావేరి నదికి అనుబంధంగా ఉండే కేఆర్ఎస్, కబిని, హేమావతి, హారంగి జలాశయాలు దాదాపు నిండిపోయాయి. 124.80 అడుగుల సామర్థ్యం కల్గిన కేఆర్ఎస్ జలాశయంలో 121 అడుగులకు నీరు చేరింది. జలాశయం భద్రత దృష్ట్యా నీటి విడుదలకు అధికారులు సిద్ధమయ్యారు. శనివారం కేఆర్ఎస్ జలాశయాన్ని ఇంజనీర్లతోపాటు జిల్లా ఎస్పీ సందర్శించారు. దాదాపు అన్ని జలాశయాలకు ఇన్‌ఫ్లో గంటగంటకు పెరుగుతుండడంతో కనీసం లక్ష క్యూసెక్కులు విడుదలకు అధికారులు నిర్ణయించారు. మైసూరు, మండ్య, హాసన్, రామనగర జిల్లాలకు వరద భయం వెంటాడుతోంది. గత ఏడాది కరువుతో ఇబ్బంది పడ్డ ప్రజలు ప్రస్తుతం బాబోయ్ వర్షాలు వద్దు అనే స్థితికి చేరారు. ప్రస్తుతం 70వేల క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు. ఈ మొత్తాన్ని లక్షకు పెంచాలని భావిస్తున్నారు. మైసూరు - ఊటీ మధ్య కపిల నదికి నీరు వదలడంతో ఉవ్వెత్తున పొంగి ప్రవహిస్తోంది. కొడగు, చిక్కమగళూరు, శివమొగ్గ, తీర ప్రాంత జిల్లాలు ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కావేరి నీరు కనకపుర మీదుగా తమిళనాడులోని మెట్టూరు డ్యామ్‌కు చేరనుంది. మెట్టూరు జలాశయానికి కేవలం నాలుగు రోజుల వ్యవధిలో 17.48 అడుగులకు నీటిమట్టం పెరిగింది. ఈనెల 16న 43.83 అడుగుల మేర మెట్టూరు డ్యామ్‌లో నీరు ఉండగా శనివారం నాటికి 61.31 అడుగులకు పెరిగింది. కేఆర్ఎస్ భర్తీకి మరో మూడు అడుగులు మాత్రమే ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మహారాష్ట్ర, కొంకణ భాగంలో నిరంతర వర్షాలతో కృష్ణ, దూద్‌గంగా నదులు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి. కొంకణ భాగంలోని కోయ్నా మహాబళేశ్వర, నవజ, వారణ, కాళమ్మవాడి ప్రదేశాల్లో భారీగా వర్షం కురుస్తోంది. కృష్ణ, ఉపనదులకు 70వేల క్యూసెక్కులను విడుదల చేశారు. బెళగావి జిల్లా నిప్పాణి తాలూకా కారదగ గ్రామంలో బంగారిబాబా దేవస్థానం జలావృతమైంది. చిక్కోడి తాలూకా కల్లోల గ్రామంలో దత్త మందిరం కృష్ణదిలో మునిగిపోయింది. చిక్కోడి విభాగంలో ఐదు కల్వర్టులు నిండిపోవడంతో రాకపోకలకు అంతరాయం నెలకొంది. కొడగు జిల్లా కేంద్రం మడికేరి తాలూకా జనతాకాలనీలో సుజాతకు చెందిన ఇల్లు కూలిపోయింది. అనారోగ్యం కారణంగా ఆమె కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని వేళ ఇల్లు కూలడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా ఆరు జిల్లాల్లో రెడ్ అలర్ట్ కొనసాగుతుందని అధికారులు ప్రకటించారు.


నంజనగూడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కపిలనది


మడికేరి తాలూకాలో కూలిన ఇల్లు

తుంగభద్రకు వరద పోటు

- ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తే అవకాశం...
- ఇన్‌ఫ్లో : 1,03,956 క్యూసెక్కులు
- ఔట్ ఫ్లో : 2,739 క్యూసెక్కులు
- నదీ పరివాహక ప్రాంతాలకు రెడ్ అలర్ట్

బళ్లారి గాంధీనగర్, జూలై 20: తుంగభద్రకు వరదపోటు తీవ్రతరం కావడంతో జలాశయం నుంచి ఏ క్షణంలోనైనా దిగువకు నీరు వదిలే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. తుంగభద్ర నది తీరప్రాంతాల్లో నివాసం ఉండే ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. గత రెండు రోజులుగా జలాశయానికి లక్ష క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో గత ఏడాది కంటే వేగంగా జలాశయంలో నీటి ప్రమాణం పెరుగుతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 68.776 టీఎంసీల నీరు చేరింది. ఇదే స్థాయిలో వరద కొనసాగితే రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో తుంగభద్ర నిండే అవకాశం ఉన్నందున ఏ క్షణంలోనైనా దిగువకు వరద నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు బోర్డు అధికారులు సార్వజనిక ప్రకటనలో.. హెచ్చరికలు జారీ చేశారు. జలాశయం ఎత్తు 1633 అడుగుల కాగా, ప్రస్తుతం 1622.55 అడుగులకు నీరు చేరిందన్నారు. డ్యాం పూర్తి స్థాయిలో నిండడానికి కేవలం 11 అడుగులు మాత్రమే ఉందన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచే తుంగభద్ర కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయానికి 1,03,956 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 9,536 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 12.574 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు.

ఏడాదికి 500 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి

ప్రారంభించిన అమెరికన్ కంపెనీ

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి 500 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసేలా దేశంలోనే ప్రథమ గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమ ప్రారంభమైంది. అమెరికాకు చెందిన ఓమియం కంపెనీ ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ ఎలక్ట్రోలైజర్ గిగా ఫ్యాక్టరీ ఏడాదికి 500 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయనుంది. అంచెలంచెలుగా సామర్థ్యాన్ని పెంచి 2వేల మెగావాట్ల స్థాయికి చేర్చనున్నట్లు కేంద్ర సంప్రదాయేతర ఇంధనవనరులశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి తెలిపారు. దీనిని దొడ్డబళ్లాపుర సమీపంలో ఏర్పాటు చేశారు. ఓమియం కంపెనీ 2వేల కోట్ల రూపాయల పెట్టుబడితో ఇక్కడ సంస్థ ఏర్పాటు చేసే విషయం స్వాగతించే అంశమని మంత్రి పేర్కొన్నారు. నీటి నుంచి ఉత్పత్తి చేసే గ్రీన్ హైడ్రోజన్‌ను కిలోగ్రాముల ప్రకారం నిర్ధారిస్తారని, సంగ్రహణ, రవాణా సులభతరమని తెలిపారు. రసాయన ఎరువులు, ఉక్కు ఉత్పత్తితోపాటు వాహనాలకు ఎథనాల్ మిశ్రమంగాను వాడవచ్చునని, సంస్కరణ ప్రక్రియలో సులభతరంగా వాడవచ్చు అన్నారు. రాష్ట్రం పరిశ్రమల స్నేహిగా ఉందని, దేశ ఆర్థికత 2030 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి పెంచడమే లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రికల్ వాహనాలకు ఆదరణ పెరుగుతోందని, పర్యావరణ రక్షణకు ప్రజల్లో చైతన్యం కలుగుతోందన్నారు. 2016 నుంచి పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి దేశం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. టాటా కంపెనీలు, ఎన్‌టీపీసీలు వీటి లాభాల పట్ల అర్థం చేసుకున్నాయని అన్నారు. కర్ణాటక సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. కంపెనీ ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. స్థాయిని పెంచడం ద్వారా ఎక్కువ మందికి ఉద్యోగాలు లభించనున్నాయన్నారు.


దొడ్డబళ్లాపుర పరిధిలో ఓమియం కంపెనీ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, రాష్ట్ర మంత్రి ఎంబీ పాటిల్

ముడా స్థలాల వివాదంలో
సీఎంపై లోకాయుక్తకు ఫిర్యాదు
400 పేజీల ఆధారాలు సమర్పించిన బీజేపీ నేత

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) మంజూరు చేసిన ఇంటి స్థలాల వివాదంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై బీజేపీ నేత ఎన్ఆర్ రమేశ్ శనివారం ఆధారాలతో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. సిద్దరామయ్య ఆర్థికమంత్రిగా, డీసీఎంగా, సీఎంగా ఉన్నప్పుడు భూ అక్రమాలు, ముడా అవినీతిలో భాగస్వామ్యులయ్యారని 400 పేజీల ఆధారాలతో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ముడా స్థలాల పంపిణీకి సంబంధించి సీఎం సిద్దరామయ్య కుటుంబంపై ఆరోపణలు వచ్చాయి. ప్రతిపక్షాలు శాసనసభలో ఆందోళన చేస్తున్నాయి. ఇదే తరుణంలోనే లోకాయుక్తకు ఫిర్యాదు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అనంతరం ఎన్ఆర్ రమేశ్ మీడియాతో మాట్లాడుతూ 1997-98 జేహెచ్ పటేల్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న సిద్దరామయ్య ముడా స్థలాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. 2013-18దాకా సీఎంగా ఉన్నప్పుడు నిబంధనలు ఉల్లంఘించి మైసూరు విజయనగర్ 2, 3వ లే అవుట్‌లలో 39వేల చదరపు అడుగుల 14 స్థలాలను తన పేరిట చేసేలా ముడా సభలో అనుమతులు పొందారని పేర్కొన్నారు. 2022లో ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు 14 స్థలాలను భార్య పార్వతి పేరిట రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. దేవనూరు లే అవుట్‌లో స్థలం ఐదారు కోట్ల రూపాయలు ఉండగా విజయనగర్‌లో 14 లే అవుట్‌లో రూ.50-60 కోట్లు ఉంటుందన్నారు.


లోకాయుక్త కార్యాలయం వద్ద ఫిర్యాదు పత్రాలతో బీజేపీ నేత ఎన్ఆర్ రమేశ్

మధ్యాహ్న భోజనం సరఫరాకు
అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్‌తో ఒప్పందం
విద్యార్థులకు ఆరు రోజులు పౌష్టికాహారం
సీఎం, అజీం ప్రేమ్‌జీ సంతకాలు

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వంతో అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఒప్పందం చేసుకుంది. శనివారం నగరంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఫౌండేషన్ చైర్మన్ అజీం ప్రేమ్‌జీ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తద్వారా మూడేళ్లపాటు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 55 లక్షల మంది విద్యార్థులకు పౌష్టికాహారం సమకూర్చనున్నారు. ప్రస్తుతం వారానికి రెండు రోజులు గుడ్డు పంపిణీ చేస్తున్నారు. ఒప్పందానికి అనుగుణంగా మరో నాలుగురోజులు విద్యార్థులందరికీ గుడ్డు సమకూర్చనున్నారు. తద్వారా ఆరు రోజులు విద్యార్థులకు పౌష్టికాహారం అందనుంది. ఈ సందర్భంగా సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ పేద పిల్లలకు గుణాత్మక విద్య అందించడం తమ ఆశయమని, అందుకు అజీం ప్రేమ్‌జీలాంటివారు కలసిరావడం సంతోషకరమన్నారు. విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప, విప్రో సంస్థ చైర్మన్ అజీం ప్రేమ్‌జీ దంపతులు, ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఎల్‌కే అతీక్, ఎమ్మెల్సీ నజీర్ అహ్మద్, మెహ్రోయి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


అజీం ప్రేమ్‌జీతో ఒప్పందం చేసుకుంటున్న సీఎం సిద్దరామయ్య

మట్టిచరియల నుంచి
ఏడుగురి మృతదేహాల వెలికితీత
మరో ముగ్గురి కోసం గాలింపు

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా శిరూరు వద్ద మట్టిచరియలు విరిగిపడిన ప్రమాదంలో ఏడుగురి మృతదేహాలు వెలికితీయగా మరో ముగ్గురి దేహాల కోసం గాలింపులు కొనసాగుతున్నాయి. మంగళవారం జాతీయ రహదారి 66పై ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. శనివారం నాటికి దాదాపు 75శాతానికిపైగా మట్టి తొలగించే పనులు పూర్తి చేశారు. నౌకాదళం, సీబర్డ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు కార్యాచరణలో పాల్గొన్నాయి. గంగావళి నది కాలువలో సీబర్డ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగించాయి. రోడ్డు దాదాపు సాధారణ స్థితికి తీసుకొచ్చినా ఇప్పట్లో సంచారానికి వీలు ఉండదని జిల్లా అధికారులు ప్రకటించారు. వర్ష ప్రభావం ఇంకా కొనసాగుతున్నందున వెంటనే సంచారానికి అవకాశం ఇవ్వలేమని చెబుతున్నారు. జిల్లా అధికారుల సమాచారం ప్రకారం పదిమంది గల్లంతు కాగా వీరిలో ఏడుగురి మృతదేహాలు లభించాయి. శిరూరు గ్రామానికి చెందిన జగన్నాథనాయక, సన్నిగౌడ, కేరళ ట్రక్ డ్రైవర్ అర్జున్ దేహాల కోసం శనివారం గాలింపులు కొనసాగించారు. శిరూరు కొండ ప్రదేశాన్ని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి కుమారస్వామి సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉండేదని తెలిపారు. ప్రమాదం జరిగిన రోజు బీజేపీ ఎంపీ విశ్వేశ్వరహెగ్డే కాగేరి పరిశీలించగా రాష్ట్రానికి చెందిన మంత్రులు ఎవ్వరూ అటువైపు వెళ్లకపోవడం విమర్శలకు కారణమైంది. కేంద్రమంత్రి కుమారస్వామి మాట్లాడుతూ 2018లో తాను సీఎంగా ఉన్నప్పుడు ఇదే ప్రాంతంలో మట్టి చరియలు విరిగిపడ్డాయని గుర్తు చేశారు. కేంద్రమంత్రులు సందర్శించే ప్రాంతాల్లో 144వ సెక్షన్ జారీ చేసి ఎవరూ వెళ్లకుండా ప్రభుత్వం అడ్డుకుందని జేడీఎస్ పార్టీ 'ఎక్స్' ద్వారా మండిపడింది. కుమారస్వామి పర్యటన ప్రచారం కాకుండా అడ్డుకునేందుకు మీడియాను వెళ్లకుండా నిర్బంధించారని విమర్శించింది.


శిరూరు కొండ సందర్శనలో రాజకీయం

ఉత్తరకన్నడ జిల్లా శిరూరు తాలూకాలో జాతీయ రహదారికి, నదికి అనుబంధంగా మట్టిచరియలు కూలిన ఘటనలో రాజకీయం తారస్థాయికి చేరింది. ప్రమాదం జరిగి నాలుగు రోజులు గడిచింది. శనివారం కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి కుమారస్వామి ఘటనా స్థలాన్ని సందర్శించారు. జిల్లా అధికారితోపాటు ఇతర అధికారులు వెళ్లారు. ఐదోరోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతుండడాన్ని కేంద్రమంత్రి పరిశీలించారు. ఇదే సందర్భంలో గల్లంతైన జగన్నాథ నాయక్ కుమార్తె కేంద్రమంత్రిని కలసి తమ తండ్రి మృతదేహాన్ని వెలికితీయించాలని వేడుకున్నారు. కేంద్రమంత్రి పర్యటనపై రాష్ట్ర మంత్రులలో అసంతృప్తి రగిలింది. డీసీఎం డీకే శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కుమారస్వామి మిలిటరీని వెంటబెట్టుకుని వెళ్లి సహాయక చర్యలు చేయించేందుకా..? అంటూ ఎద్దేవా చేశారు. మరోవైపు కుమారస్వామి పర్యటించే ప్రాంతాల్లో 144వ సెక్షన్ విధించి సుదూరంలోనే మీడియాను ఆపివేశారు. ఈ పరిణామంపై జేడీఎస్ పార్టీ ఎక్స్ ద్వారా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కుమారస్వామి కేంద్రమంత్రి అని, ఎక్కడైనా సందర్శించవచ్చునని, రాష్ట్ర ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది.


శిరూరు ప్రాంతంలో కేంద్రమంతి కుమారస్వామి పరిశీలన

నేడు సీఎం పర్యటన

శిరూరు మట్టిచరియలు కూలిన ప్రదేశాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదివారం సందర్శించనున్నారు. ఉదయం హెచ్ఏఎల్ విమానాశ్రయం నుంచి బయల్దేరి గోవా ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 2గంటలకు శిరూరు ప్రదేశాన్ని చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించనున్నారు. అక్కడ అధికారులతో సమీక్షించనున్నారు. కేంద్రమంత్రి వెళ్లి వచ్చిన తర్వాత సీఎం పర్యటన ఖరారు చేయడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1621.32	1,591.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1, 07,198	9536
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1267	245
సామర్థ్యం (టీఎంసీలు)	65.11	12.57

వాసవి అమ్మవారికి ప్రత్యేకాలంకరణ



కాయగూరలతో అలంకృతురాలైన కన్యకాపరమేశ్వరి

కంప్లి, జూలై 20: ఆషాఢమాస శనివారం సందర్భంగా పలుచోట్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఉప్పరహొసళ్లి గ్రామంలో అభయాంజనేయస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేకాలంకరణ, జరిపారు. అలాగే హగరి బొమ్మనళ్లి గ్రామంలో కన్యకా పరమేశ్వరికి శుక్రవారం, శనివారం కూరగాయలు, పండ్లతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. పురోహితులు కిషోర్, నాగరాజు, కులకర్ణి ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆర్యవైశ్య మహిళా సంఘం వాసవీ పారాయణం చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తాదులకు అన్నప్రసాదాలు కల్పించారు. అలాగే ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా సత్య నారాయణ పేటలోని బాబా ఆలయంలో ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు.

వాహనం ఢీకొని ఎలుగుబంటి మృతి



ప్రమాదంలో మృతి చెందిన ఎలుగుబంటి

బళ్లారి గాంధీనగర్, జూలై 20: గుర్తు తెలియని వాహనం ఢీకొని జాతీయ రహదారి -4లో శనివారం ఓ ఎలుగుబంటి మృతిచెందింది. చిత్రదుర్గ జిల్లా పరిధిలో తమటకల్లు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా పరిధిలోని జోగిమట్టి వన్యధామ, నగరశివారు ప్రాంతాల్లో కొండ ప్రాంతాల్లో ఎలుగుబంట్లు ఎక్కువగా సంచరిస్తుంటాయి. శనివారం తెల్లవారు జామున అడవిలో ఉన్న ఎలుగుబంటి రోడ్డుపైకి రావడంతో గుర్తు తెలియని వాహనం దానిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎలుగుబంటి దుర్మరణం పాలయింది. స్థానికులు పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని ఎలుగుబంటి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు చిత్రదుర్గ గ్రామీణ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు ప్రకాష్ గౌడ

కంప్లి, జూలై 20: గ్రామాల్లో సంఘ సంస్థలు ఇచ్చే సదుపాయాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్యులు ప్రకాష్‌గౌడ తెలిపారు. రామసాగర గ్రామంలో హొస్పేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో సోమశేఖర్, చంద్రు, ప్రకాష్ గౌడ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం మీద 75 మంది పరీక్షలు నిర్వహించారు. 35 మందికి అక్కడే కంటి అద్దాలు వితరణ చేపట్టారు. 25 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. మరో 15 మందికి ఐడ్రాప్స్, ట్యాబ్లెట్లతో చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో నిరీక్షణ అధికారి బసవరాజు, సునీత, రేఖ, మమత తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్‌ల కోసం పాటుపడే వారికి ఓటు

బళ్లారిరూరల్, జూలై 20: బళ్లారి జిల్లా అఖిల భారత వీరశైవ సంఘం వీరశైవ కార్యవర్గ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో లింగాయత్ సమాజానికి ఎంతో అంకిత భావంతో పనిచేసే వారి కోసం ఓటు వేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్ ఒక ప్రకటన తెలిపారు.

కదిలి వచ్చిన కర్షకలోకం



సన్నాపురం డిస్ట్రిబ్యూటరీ మరమ్మతుల్లో రైతులు

- ఎన్నిసార్లు వినతిపత్రాలిచ్చినా స్పందించని అధికారులు
- చేయిచేయి కలిపి 16కి.మీ. కాలువను శుభ్రం చేసుకున్న రైతులు

కంప్లి, జూలై 20 : కంప్లి తాలుకా పరిధిలోని ఎల్ఎల్‌సీ డిస్ట్రిబ్యూటరీ ముళ్లకంపలు, చెత్తా చెదారంతో నిండిపోయి సాగునీరు పారడానికి అననుకూలంగా మారింది. చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ముళ్ల కంపలు పెరిగిపోయాయి. వాటిని తొలగించాలని ఎన్నోసార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా వారికి చీమకుట్టినట్లు కూడా లేకుండాపోయింది. మరో వైపు రేపోమాపో ఉప కాలువలకు ప్రధాన కాలువ నుంచి నీరు వదులుతారని సమాచారం రైతులను నిద్రపోనీయలేదు. దీంతో వారంతా తమంతట తామే ముందుకొచ్చి తమ సొంత ఖర్చులతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు.

ఈ సందర్భంగా రైతు నాయకుడు చిగురుపాటి సురేంద్ర మాట్లాడుతూ కాలువ 16 కిలోమీటర్లు పొడవు వుండగా అందులో ముద్దాపురం, కొట్టాల్, సన్నాపురం, బెళగోడహాళ్, బసవేశ్వర క్యాంపు, నారాయణ స్వామి క్యాంపు తదితర గ్రామాలకు నీరందండం లేదు. చెత్తాచెదారం, ముళ్లకంచెలు కారణంగా పైభాగం నుంచి నీరు కిందకు రావడం లేదు. దీనికితోడు తూములకు షట్టర్లు లేకపోవడంతో నీరు వృథా అవుతోంది. చిన్ననీటి పారుదల శాఖ రూ. 1.40 లక్షలు నిధులు మంజూరు చేసినా అందులో రూ. 40 వేలు కాంట్రాక్టర్ కమీషన్‌కు, రూ. 20 వేలు కాడా సంఘానికి పోగా రూ. 40 వేలు మాత్రమే కాలువ పనులకు మిగులుతుంది. ఈ కొంచెం మొత్తంతో ఈ 16 కిలోమీటర్ల కాలువ అభివృద్ధి సాధ్యం కాదని భావించారు. ఈ యేడాది ఖరీఫ్ పంటలు పండించేందుకు అధికారులపై ఆధార పడకుండా తమంతట తామే కాలువ మరమ్మతు చేసుకోవాలనుకున్నారు. రైతులంతా తలా రూ. 50 వేలు వంతున వసూలుచేసుకుని కాలువలో ఎక్స్‌వేటర్ సాయంతో కంచెలు, కంపలు తదితర అడ్డంకులు తొలగించుకున్నారు. సాగునీరు పారడానికి అడ్డంకులు లేకుండా చేసుకున్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి రైతులు కృష్ణంరాజు, వెంకట నాయుడు, రంగయ్య, పుల్లయ్య, గంగన్ననరసింహులు, హరిబాబులు నడుంకట్టారు. ఇప్పుడు విస్తుపోవడం అధికారుల వంతయింది.

నేడు గురుపౌర్ణమి వేడుకలు



బళ్లారిరూరల్, జూలై 20: బళ్లారి నగరంలోని అనంతపురం రోడ్డు ఎంజీ విశాల్‌నగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ధార్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్ కుమారస్వామి తెలిపారు. భక్తులందరూఈ సందర్భంగా షిర్డీసాయిబాబా దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

సిరుగుప్ప, జూలై 20 : డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని తాలుకా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఈరణ్ణ తెలిపారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణం 29వ వార్డులో పర్యటించి ప్రతి ఇంటిని సందర్శించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తొట్టిలు, డ్రమ్ములలో ఎక్కువ కాలం నీటిని నిల్వ వుంచరాదన్నారు. ఎప్పటికప్పుడు అన్నిటిని పరిశుభ్రంగా వుంచుకోవాలని ఆయన తెలిపారు.

వైద్యంకోసం డోలీలో ఐదు కిలోమీటర్లు

- భుజాలమీద మోసుకెళ్లి ప్రాణాలు కాపాడారు...
- మౌలిక సౌకర్యాలకు దూరంగా అంగావ్ గ్రామం

బళ్లారి గాంధీనగర్, జూలై 20: వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా... అక్షరాలా ఇది నిజం. తీవ్ర జర్వంతో మూర్ఛపోయిన మహిళను డోలీలో ఒకటి కాదు... రెండు కాదు... ఏకంగా ఐదు కిలోమీటర్లు మేర అటవీ ప్రాంతం నుండి రోడ్డు మార్గం వరకు మోసుకెళ్ళి ఆమె ప్రాణాలు కాపాడిన ఆ గ్రామ ప్రజల మానవత్వానికి అభినందనలు చెప్పాల్సిందే. బెళగావి జిల్లా, ఖానాపుర తాలూకా పరిధిలోని అటవీ ప్రాంతం మధ్యలో ఉన్న అంగావ్ అనే గ్రామానికి ఇంతవరకు రోడ్డు లేదు, మొబైల్ నెట్‌వర్క్ లేదు... ఇలాంటి గ్రామంలో తీవ్ర జ్వరంతో మూర్ఛపోయిన 36ఏళ్ళ హర్షదా అనే మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో చేసేది లేక జోరుగా కురుస్తున్న వర్షాన్ని, దట్టమైన అడవిని లెక్కచేయకుండా గ్రామానికి చెందిన మహిళలు ప్లాస్టిక్ టార్‌పాల్‌లో రోగిని చుట్టి, కట్టెలతో తయారు చేసిన స్ట్రెచ్చర్‌పై వర్షానికి తడవకుండా ఏకంగా ఐదు కిలోమీటర్ల దూరంలో రోడ్డుకు వరకు తీసుకెళ్ళి అక్కడ నుంచి 108 అంబులెన్స్ వాహనంలో బెళగామ్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆ గ్రామంలో ఇలాంటి అనారోగ్యపరమైన సమస్యలు వస్తే వారి పరిస్థితి ఘోరంగా ఉంటుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు అంగావ్ గ్రామానికి అవసరమైన రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



కట్టెలపై మహిళను తీసుకెళుతున్న దృశ్యం

గర్భిణుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- బర్త్ సర్టిఫికెట్‌ను రుజువుగా పరిగణించాలి - శశిధర కోసాంబే

బళ్లారి సిటీ,జూలై 20: జిల్లాలో గర్భిణుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని రాష్ట్ర బాలల కమిషన్ సభ్యుడు శశిధర కోసాంబే స్పష్టం చేశారు. నగరంలోని జిల్లాపంచాయితీ హాల్లో శనివారం బాలల రక్షణ వ్యవస్థపై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సంప్రదింపుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణుల సమాచారాన్ని నమోదు చేసేటపుడు అన్ని పత్రాలను పరిశీలించి సరిగా నమోదు చేయాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో 30శాతం భ్రూణహత్యలు నమోదవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కమిషనర్లు, జీపీఎం, సీఈఓలతో సమావేశం నిర్వహించి కఠిన ఆదేశాలు జారీ చేశారన్నారు. దాని ప్రకారం జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ బుక్ స్కానింగ్ రేటు తదితర సమాచారాన్ని బోర్డు లేదా పోస్టర్ ద్వారా ప్రదర్శించాలన్నారు.

జిల్లాలో 2023-24లో 78 మాతాశిశు మరణాలు నమోదయ్యాయని, జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 7,936మంది గర్భిణులు(19 ఏళ్లలోపు)వారు ఉన్నట్లు గుర్తించామన్నారు, జిల్లాలో మొత్తం 76స్కానింగ్ కేంద్రాలు ఉండగా గత మూడు నెలల్లో 74స్కానింగ్ కేంద్రాలను సందర్శించి లోటుపాట్లను పరిశీలిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కుటుంబ సంక్షేమ అమలు అధికారి డాక్టర్ పూర్ణిమ కట్టిమణి మాట్లాడుతూ ప్రతినెలా ఒకసారి జిల్లా ఆరోగ్య సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు.



మాట్లాడుతున్న బాలల కమిషన్ సభ్యుడు శశిధర కోసాంబే

రాష్ట్ర బాలల కమిషన్ సభ్యుడు శశిధర కోసాంబే మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లలో అవగాహన కల్పించాలన్నారు. లార్వా ఉత్పత్తి కాకుండా చూసుకోవాలని పరిశుభ్రత పాటించాలన్నారు. బాలకార్మికులను గుర్తించి వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి తాలూకా తహసీల్దార్ నేతృత్వంలో కార్మిక శాఖ ఇతర సంబంధిత అధికారుల బృందం నెలలో రెండు సార్లు అకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. ఈసందర్భంగా జిల్లా లీగల్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్ర నోరువిప్పితే ప్రభుత్వం ఢమాల్

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బళ్లారి సిటీ,జూలై 20: వాల్మీకి నిగమలో జరిగిన కుంభకోణంలో మాజీ మంత్రి నాగేంద్ర నోరు విప్పితే రాష్ట్రంలో కాంగ్రెస్ సిద్దరామయ్య ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పేర్కొన్నారు. సండూరులో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ కుంభకోణం తమ కాళ్లకు చుట్టుకోకుండా ఉండేందుకు ప్రభుత్వానికి సంబంధం లేదని చెబుతున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రులు అసమర్థులుగా ఉన్నప్పుడు అధికారులు ఇలాంటి మోసాలకు పాల్పడతుంటారన్నారు. మంత్రి మౌఖిక ఆదేశం మేరకే ఈ స్కాం జరిగిందన్నారు. ఎన్నికల కోసం వాల్మీకి నిగమ మండలిలోని సొమ్మును దోచుకుని ఎన్నికలకు వినియోగించారని, అయినా తమకు సంబంధం లేదన్నట్లుగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య వ్యవహ రిస్తున్నారన్నారు. బీజేపీలో జరిగిన కుంభకోణాలపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రులు చెబుతున్నారని, దమ్ముంటే విచారణ చేయాలని విజయేంద్ర సవాల్ విసిరారు. చోరికి గురైన సొమ్ము తిరిగొచ్చిందని ముఖ్యమంత్రి చెబుతున్నారని, సొమ్మునువాడుకున్న వారికి డబ్బులు ఇచ్చి మళ్లీ తిరిగి డబ్బులు తెచ్చుకున్నట్లు చెబుతున్నారన్నారు. విలేకరుల సమావేశంలో బళ్లారి సిటీ మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, మల్లనగౌడ, దేవేంద్రప్ప, ఇదర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

23 నుంచి గర్భాశయ క్యాన్సర్ క్యాంపు



సమావేశంలో మాట్లాడుతున్న టీజీ విఠల్, డా.చందన తదితరులు

బళ్లారి సిటీ, జూలై 20: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈనెల 23న ఉచిత గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహిస్తున్నామని ఫ్యామిలీ ప్లానింగ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా బళ్లారి శాఖ అధ్యక్షుడు టి.జి.విఠల్ తెలిపారు. తమ అసోషియేషన్‌ను ప్రారంభించి దాదాపు 75 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా అమృత మహోత్సవాలను జరుపుతున్నామని తెలిపారు. శనివారం ఫామిలీ ప్లానింగ్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 31వరకు ఈ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ చందన మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రతి 8నిముషాలకు ఒక మహిళ గర్భాశయ క్యాన్సర్‌తో మరణిస్తోందన్నారు. పరీక్షలు చేయించుకునే వారు 8550017521 నంబర్‌కు ఫోన్‌చేసి పేరు నమోదు చేసుకోవచ్చని లేదా సంస్థను సందర్శించి వ్యక్తిగతంగా నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందరికీ అందుబాటులో ఉందన్నారు. కుటుంబ నియంత్రణ సంస్థ దీనిని రూ.1500కే అందిస్తోందన్నారు. తదనంతరం బ్రాంచ్ మేనేజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అమృతమహోత్సవంలో భాగంగా జూలై 23వతేది మంగళవారం ఏడాది పొడవునా జరిగే కార్యక్రమాలను బళ్లారి జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రారంభిస్తారన్నారు. ఉచిత సర్వైకల్ క్యాన్సర్ క్యాంపును బళ్లారి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు శోభరాణి ప్రారంభిస్తారన్నారు. ముఖ్యఅతిథులుగా బళ్లారి వైద్యాధికారి రమేశ్ బాబు హాజరవుతారన్నారు. ఈసందర్భంలో ఫ్యామిలీ ప్లానింగ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు విజయసింహ, బళ్లారి శాఖ అధ్యక్షుడు టి.జి.విఠల్, బాగ్య, సభ్యులు విష్ణు, అహిరాజ్ పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాహుల్ శరణప్ప

బళ్లారి సిటీ, జూలై 20: మత్స్యకారులు మత్స్యశాఖ ద్వారా అందచేస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తాలూకా పంచాయితీ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ మత్స్యరైతుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా పంచాయితీ కార్యక్రమం కింద నిర్మించిన అమృత సరోవరం చెరువుల్లో చేపల ఉత్పత్తిని పెంచాలని మత్స్య రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఎస్.షడక్షర్, బళ్లారి జోనల్ సహకార శాఖ సంచాలకులు కేసరిముత్, మత్స్య శాఖ ఉపసంచాలకులు శివన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో సదుపాయాల కరువు

సిరుగుప్ప, జూలై 20 : ఆర్టీసీ బస్టాండులో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిరుగుప్ప పట్టణం ఆర్టీసీ బస్టాండులో కూర్చోవడానికి చైర్లు లేవు, తాగేందుకు మంచినీరు లేవు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నిలబడి వున్న ప్రయాణికులు

హోసూరు జోన్

23న విద్యుత్ బోర్డు ఎదుట నిరసన



అన్నాడీఎంకే కార్యాలయంలో మాజీ మంత్రి నేతృత్వంలో సమావేశం

హోసూరు, జూలై 20: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా 23న హోసూరు విద్యుత్ బోర్డు కార్యాలయం ఎదుట నిర్వహించే ప్రదర్శనల్లో నిర్వాహకులు, వలంటీర్లు అధిక సంఖ్యల్లో పాల్గొనాలని మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి కోరారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే తరఫున బాగలూరు రోడ్డు అన్నాడీఎంకే కార్యాలయంలో సంప్రదింపుల సమావేశం జరిగింది. సమావేశానికి అయన అధ్యక్షత వహించారు. ఈ విషయంలో హోసూరు ప్రాంతీయ కార్యదర్శులకు సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంల్లో హోసూరూ ఏరియా కార్యదర్శులు రాజీ, వాసువేదన్ అశోకరెడ్డి, అమ్మ పరిషత్ జిల్లా కార్యదర్శి చిట్టి జగదీష్, అన్నా పరిశ్రమల సంఘం జిల్లా కార్యదర్శి చెన్న కృష్ణన్, తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో నీటి కష్టాలు

హోసూరు, జూలై 20: హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తిరువళ్ళర్ ప్రాంతానికి గత ఐదు నెలలుగా తాగునీరు పంపిణీ చేయడం లేదని, అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని 50 మందికి పైగా కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి నిరసన తెలిపారు. ఒక్కో ట్రాక్టరు రూ.1000 వరకు చెల్లించి వినియోగిస్తున్నామని, అయినా అధికారులు పట్టించుకోవడంలేదని, తాగునీరు పంపిణీ చేయకుంటే మరింత ఉధృతంగా పోరాటం చేయాల్సి వస్తుందని తెలిపారు.

బస్సులు లేక ప్రయాణీకుల అవస్థలు



తిరువణ్ణామలై గిరివలానికి వెళ్లే ప్రజలతో కిక్కిరిసి పోయిన బస్టాండు

హోసూరు (సిప్‌కాట్) జూలై 20: తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణానికి వెళ్లే వేలాది మంది ప్రజలు శుక్రవారం హోసూరు బస్ స్టేషన్‌లో గందరగోళం సృష్టించారు. గత రాత్రి తిరువణ్ణామలై వెళ్లడానికి వేలాది మంది ప్రయాణికులు, ఒకేసారి బస్సు కోసం హోసూరు బస్‌స్టాండుకు చేరుకున్నారు. ప్రతినెల పౌర్ణమి రాత్రి వందలాది మంది యాత్రికులు గిరివలం కోసం తిరువణ్ణామలై సందర్శించడానికి లక్షలాది మంది అక్కడికి వెళ్లతారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆదివారం వేలాది మంది ప్రజలు అక్కడికి వెళ్లేందుకు హోసూరు బస్ స్టేషన్‌కు తరలివచ్చారు. కాని సరిపడా బస్సులు లేకపోవడంతో బస్ స్టేషన్‌లో తిరువణ్ణామలై వెళ్లే బస్సుకోసం పడిగాపులు కాశారు. ఈ కారణంగా తిరువణ్ణామలైకి మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని రవాణాశాఖను ప్రజలు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న వార్డు ప్రజలు

కృష్ణానదికి పెరిగిన వరద

- గడ్డెగూళి బసవేశ్వర ఆలయం నీట మునక
- తీరగ్రామాలకు అధికారుల హెచ్చరిక

రాయచూరు, జూలై 20: కృష్ణానదికి ఎగువ భాగంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నదికి వరద ప్రవాహం పెరిగింది. ఆలమట్టి జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగి 20 గేట్ల ద్వారా నీటి బయటికి వదులుతుండడంతో జిల్లాలోని నారాయణపూర్ జలాశయానికి 66 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో నారాయణపూర్ వద్ద 22 గేట్‌లను ఎత్తి 68,480 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌ఫ్లో మరింత పెరిగితే నీటిని అంతే ప్రమాణంలో దిగువకు విడుదల చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. కాగా జిల్లాలో కృష్ణానది తీర ప్రాంతంలోని పలుగ్రామాలకు అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. దేవదుర్గ తాలూకా హూవినహడగి వద్ద ఉన్న వంతెన మునిగిపోతుండడంతో ఆదివారం నుంచి దేవదుర్గ-కలబుర్గి రహదారిలో రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీంతో పాటు లింగసుగూరు-దేవదుర్గ-రాయచూరు తాలూకాల్లోని తీరగ్రామాల ప్రజలకు ఇప్పటికే అధికారులు చాటింపు వేసి వరద ప్రవాహం మెచ్చరికలు జారీ చేశారు.



నీట మునిగిన గడ్డెగూళి బసవేశ్వర ఆలయం

కాగా కృష్ణనది మధ్యలో దేవదుర్గ తాలూకా పరిధిలోని గడ్డెగూళి బసవేశ్వర ఆలయం పూర్తిగా నీట మునిగిపోగా కేవలం శిఖరం మాత్రమే కనిపిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. నదికి వరద ప్రవాహం పెరిగితే గుడి పూర్తిగా నీట మునిగే అవకాశం ఉందని తెలిపారు.

ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలి

రాయచూరు, జూలై 20: నగర సమీపంలోని యరమరస్ శివారులో నిర్మించతలపెట్టిన రాయచూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని బాలలు, మహిళల హక్కుల వేదిక నాయకులు కోరారు. శనివారం జిల్లాధికారి సతీశ్‌ను కలిసి వేదిక ప్రతినిధులు వినతి పత్రం ఇచ్చారు.

ఎన్నో ఏళ్లుగా విమానాశ్రయ నిర్మాణం కోసం ఈ ప్రాంత వాసులు ఎదురు చూస్తుండగా ఇప్పటికి భూ సేకరణ పనులు పూర్తయ్యాయని సాంకేతిక సమస్యల అడ్డంకులను తొలగించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా జిల్లా ద్వారా వెళుతున్న 167వ జాతీయ రహదారికి సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు అనుకూలంగా ఉండేలా కార్యాలయాన్ని శక్తినగర్ సమీపం నుంచి జిల్లా కేంద్రానికి తరలించడం వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంతోషం వ్యక్తం చేశారు. సత్వర నిర్ణయం తీసుకుని రైతులకు సౌకర్యం కల్పించిన జిల్లాధికారికి ఈ సందర్భంగా వేదిక ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

గురు పూర్ణిమ



ఆషాఢ శుద్ధ పౌర్ణమిని గురు పూర్ణిమ లేదా వ్యాసపూర్ణిమగా ఆచరిస్తారు. వ్యాసమహాముని పుట్టిన రోజు కావడంతో ప్రాధాన్యత ఉంది. హిందూధర్మంలో గురువును భగవంతుడికి భక్తుడికి మధ్య సంధానకర్తలుగా భావిస్తారు. వేదవ్యాసుడి మానవ జాతి అంతటికీ మంచి ఆధ్యాత్మిక వారసత్వాన్ని మిగిల్చి వెళ్లారు. కాబట్టి ఆయనను మానవాళి అంతటికీ గురువుగా భావిస్తున్నారు. ఆయన పూర్వనామం కృష్ణ ద్వైపాయనుడు. వేదకాలపు సంస్కృతి అంతా నాలుగువేదాల్లో సంకలనం చేసిన ఆయనను వేద వ్యాసుడిగా పేరొందారు. ఆధ్యాత్మ పరాయణుడైన వ్యాసుని మించిన సమాజశాస్త్రజ్ఞులు ఎవరూ లేరు.

ఎర్నెస్ట్ హెమింగ్‌వే (జయంతి)



అమెరికా దేశానికి చెందిన నవలా రచయిత ఎర్నెస్ట్ మిల్లర్ హెమింగ్ వే 1899 జూలై 21న జన్మించారు. చిన్నకథల రచయిత, పాత్రికేయుడు, క్రీడాకారుడిగా రాణించారు. 1920 నుంచి 1950 మధ్య ఆయన రచనలు అమెరికన్ సాహిత్యంలో క్లాజిక్‌గా నిలిచాయి. 'ది సన్ ఆల్సో రైజెస్', 'ఏ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్' నవల ఎంతగానో పేరొందాయి. పులిట్జర్ ప్రైజ్, నోబెల్ పురస్కారం అందుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఆయన ధైర్యసాహసాలకు బ్రాంజ్ స్టార్ గుర్తింపు పొందారు. 1961 జూలై 2న కన్నుమూశారు.

గంగూబాయి హానగల్ (వర్ధంతి)



పద్మవిభూషణ్ గ్రహీత గంగూబాయి హానగల్ 1913 మార్చి 5న కర్ణాటక రాష్ట్రం ధారవాడలో జన్మించారు. హిందూస్తానీ సంగీత కళాకారిణి. ప్రత్యేకించి కిరానా ఘరానాలోని ఖాయల్‌లో రాణించారు. దేశవ్యాప్తంగా కచేరీలలో పాల్గొని తన అద్భుత గ్రాతంతో సభికులను అలరించారు. ఆల్ ఇండియా రేడియో స్టేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కర్ణాటక యూనివర్సిటీ గౌరవ మ్యూజిక్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, పద్మభూషణ్, పద్మవిభూషణ్ తదితర అవార్డులు అందుకున్నారు. 2009 జూలై 21న కన్నుమూశారు.

శివాజీ గణేశన్ (వర్ధంతి)



తమిళనాట 'నడిగర్ తిలగం'గా పేరొందిన శివాజీ గణేశన్ 1928 అక్టోబరు 1న విల్లుపురంలో జన్మించారు. నటుడు, నిర్మాతగా రాణించి తమిళ సినిమా రంగంలో తనదైన ముద్రను చాటారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో బెస్ట్ యాక్టర్ అవార్డు అందుకున్న తొలి నటుడు. ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్, తమిళనాడు స్టేట్ అవార్డ్స్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, కళైమామణి, పలు గౌరవ డాక్టరేట్‌లు, పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. చెన్నై, పుదుచ్చేరిలలో ఆయన విగ్రహాలు నెలకొల్పారు. 2001 జూలై 21న కన్నుమూశారు.

గురుపూర్ణిమకు ఏర్పాట్లు



జేపీ నగర్ ఆలయంలో ఏర్పాట్లు ఇలా..

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని రాష్ట్రమంతటా షిర్డీసాయి బాబా ఆలయాలతోపాటు గురు రాఘవేంద్ర స్వామి, దత్తాత్రేయస్వామి సహా పలు ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వందలాది ఆలయాలలో గురుపూర్ణిమను దర్శనంకోసం వచ్చే భక్తులకోసం సౌలభ్యాలు కల్పిస్తున్నారు. బెంగళూరులో మల్లేశ్వరం, త్యాగరాజ నగర్‌తోపాటు వివిధ ప్రాంతాలలోని ఆలయాలో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. జేపీనగర్‌లోని సత్య గణపతి షిర్డీ సాయి ఆలయంలో పూలుపండ్లతో అలంకరణలు చేశారు. ఈ ఆలయంలో ఏటా ఒక థీమ్‌తో ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలిసిందే.

యూట్యూబర్ ఆత్మహత్య

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రా మీణ జిల్లా నెలమంగల తాలూకా ధర్మనాయకన తాండా ప్రాంతంలో మంజునాథ్ (35) అనే యూ ట్యూబర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు శుక్రవారం రాత్రి బెంగళూరు మంజునాథ నగర్‌లోని యూట్యూబ్ ఆఫీస్‌లో లైవ్‌లోకి వచ్చాడు. పోలీసులనుంచి అవమానానికి గురయ్యానని వారు దౌర్జన్యం చేశారని ఏడ్చారు. ఏం చేశాననేది యూ ట్యూబ్‌లో వివరించారు. ఆ తర్వాత కార్యాలయంలో డెత్ నోట్‌లో నా మృతికి ఎవరూ కారణం కాదని పేర్కొన్నారు. ఆ తర్వాత మిత్రుడు బైక్‌తో ధర్మనాయకనతాండా పరిధిలోని అటవీప్రాంతానికి వెళ్లి చెట్టుకు ఉరి వేసు కున్నారు. సమాచారం అందుకున్న నెలమంగల పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి తల్లి సరోజమ్మ మీడియాతో మాట్లాడుతూ మానసికంగా కుంగిపోయినట్టు తెలిపారు. ఎందుకు ఆత్మహత్య చేసు కున్నాడో తెలియదు అని, ఆత్మహత్య లేదా హత్య అనేది పోలీసులే తేల్చా లన్నారు. ఇతడిని ఏ పోలీసులు వేధిం చారనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

ఫోన్‌పే యాప్‌పై కన్నడ సంఘాల ఆగ్రహం

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌పే యాప్‌పై కన్నడ సంఘాలు మండిపడుతున్నాయి. యాప్‌ను రద్దు చేసుకోవాలని సోషల్‌మీడియాలో డిమాండ్ చేస్తున్నారు. కన్నడిగులకు ఉద్యోగాల రిజర్వేషన్ అం శంపై ఫోన్ పే సీఈఓ సమీర్‌నిగమ్ వ్యతిరేకంగా ఎక్స్ ద్వారా పోస్టు చేసిన మేరకు కన్నడ సంఘాలు అభ్యం తరాలు వ్యక్తం చేశాయి. ఈమేరకు బాయ్‌కాట్ ఫోన్‌పే అంటూ సోషల్‌మీడియాలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక రక్షణా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నారా యణగౌడ ఈ మేరకు డిమాండ్ చేశారు. రాష్ట్రమంతటా ఫోన్‌పేను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కన్నడ అభిమానులు ఎవరిముందు తలవంచరన్నారు. సమీర్ నిగమ్ రాష్ట్రంలో వ్యాపారాలు ఇకపై చేసుకోవాలని, మేం తగిన గుణపాఠం చెబుతామన్నారు.

వెదురు అలంకరణతో బ్యాంబూ బజార్ మెట్రో స్టేషన్

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నమ్మ మెట్రో స్టేషన్‌లు ఆకర్షణీయంగా ఉండేందుకు బ్యాంబూ బజార్ స్టేషన్‌ను తీర్చిదిద్దుతున్నారు. అగ్రహార - నాగవారల మధ్య ఉండే బాంబూబజార్ మెట్రో స్టేషన్ (పాటరీటౌన్) ను సంపూర్ణంగా వెదురు అలంకరణతో నిర్మించేందుకు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ (బీఎంఆర్‌సీఎల్) సిద్ధమైంది. వెదురు సొసైటీ ఆఫ్ ఇండియా ప్రస్తావనను స్వీకరించిన బీఎంఆర్‌సీఎల్ ప్రయాణీకుల భద్రతను కాపాడు కుంటూనే అగ్నిప్రమాదాలకు అవకాశం లేకుండా ఉండేలా వెదురుతో అలంకరణలు చేసేందుకు అంగీకరించింది. కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టర్మినల్ 2లో వెదురు ఉపయోగించి ఇంటీరియర్ డెకరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఢిల్లీలో నిర్మించిన కొత్త పార్లమెంటు భవనం ఫ్లోరింగ్, గోడలను వెదురుతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇదే తరహాలోనే మెట్రో స్టేషన్ లోపలిభాగంలో పూర్తిగా వెదురుతోనే అలంకరణలు చేయ దలిచారు. త్రిపురన్ బాంబూసా తుల్డా రకం వెదురు ఉప యోగించడం ద్వారా దీర్ఘకాల మన్నిక ఉంటుందని నిర్ణయించారు. ప్రపంచంలోనే వెదురు ఉత్పత్తులలో భారత్ మొదటి స్థానంలో ఉంది. ఇక్కడి వెదురును స్టేషన్‌లో అందా నికి ఉపయోగించడం ద్వారా కొత్త దనం ప్రజలకు పరిచయం చేసినట్టు ఉంటుందని వెదురు సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పునతి శ్రీధర్ వెల్లడించారు. ఆ ఆలోచనతోనే నమ్మ మెట్రో ఆర్కిటెక్చర్స్‌తో చర్చలు జరుపుతున్నామన్నారు. పాటరీ టౌన్ ప్రాంతాన్ని బాంబూబజార్‌గా పిలుస్తారని అందుకే ఇక్కడి స్టేషన్‌ను వెదురుతో అలంకరించే విషయమై చర్చలు జరుపుతున్నామన్నారు. అండర్ గ్రౌండ్‌లో వెదురు ఉపయోగించడం కష్టమని అందుకే ప్రవేశ ద్వారంతోపాటు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటుకు నమ్మమెట్రో సుముఖత వ్యక్తం చేసిందన్నారు. మెట్రో చీఫ్ ఇంజనీర్ దయా నందశెట్టి అభిప్రాయం మేరకు మెట్రోస్టేషన్ లోపలిభాగంలో సంపూర్ణంగా వెదురుతో ఏర్పాటు చేయడం కొన్ని సమస్యలకు కారణం కానుందని అందుకే కొంత మేర మాత్రమే డిజైన్లను వెదు రుతోనే తీరుస్తామన్నారు. బన్నేరుఘట్ట రోడ్డులో జయదేవ ఆసుపత్రి నుంచి మీనాక్షి టెంపుల్‌దాకా మెట్రో మార్గంలో వెదురును పెంచాలని బీఎంఆర్‌సీఎల్ నిర్ణయం తీసుకుం దన్నారు. సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేసుకుని వెదురు పెంచాలని కూడా వెదురు సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలు ఇచ్చిందన్నారు. 2025 డిసెంబరు నాటికి అగ్రహార - నాగవార మార్గం స్టేషన్‌లమధ్య మెట్రో రాకపోకలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.


నిర్మాణ పనులు ఇలా..


ప్రతిపాదిత నమూనా స్టేషన్ ఇలా..

కుల వ్యవస్థ మనిషి సృష్టి : సీఎం



కళాబృందాలు, స్వామీజీతో సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కుల వ్యవస్థ దేవుడు చేసినది కాదని స్వార్థం కోసం మనుషులు చేసిన సృష్టి అని సీఎం సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. చిత్రదుర్గలో బోవి గురుపీఠం సిద్ధరామేశ్వర మహాసంస్థానం ఇమ్మడి రామేశ్వర స్వామీజీ దీక్షా రజత మహోత్సవంలో శనివారం పాల్గొన్నారు. మంత్రాలయ రాఘవేంద్రమఠాధిపతి సుబు దీంద్ర తీర్థ స్వామీజీతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ విద్య అవకాశం చిక్కిన కొందరు మాత్రమే ఆర్థికంగా ఎదిగారని విద్య లభించినవారు కుల వృత్తులపై ఆధారపడ్డారన్నారు. హిందువులు, శోషిత సమాజానికి చెందినవారి విముక్తి కోసం అంబేడ్కర్ విద్యార్థి దశనుంచే పోరాటం చేసిన మహనీయుడన్నారు. సమాజంలో అసమానత తొలగితేనే సమానత్వం సాధ్యమన్నారు. శతాబ్దాలకాలంగా గులాం వ్యవస్థ ఉన్నందునే నిమ్నవర్గాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఇప్పటికీ విద్య కొరతతో గులాంగిరీ మన స్థితినుంచి బయటకు రావడం సాధ్యం కావడం లేదన్నారు. ఆత్మాభిమానం పెంచుకుని గులాంగిరినుంచి బయటకు రావాలని పిలుపునిచ్చారు. విద్య ప్రతి ఒక్కరికీ ప్రాథమికహక్కు. అని గతంలో కొంతమందికి మాత్రమే దక్కేదన్నారు. అందుకే మా ప్రభుత్వం వెనుక బడినవర్గాలకు విద్య అందించేందుకు కట్టుబద్ధామన్నారు. మంత్రులు సుధాకర్, శివరాజ్ తంగడగి, సతీశ్‌జార్కిహొళి, ఎమ్మెల్యేలు వీరేంద్రపప్పి, రఘుమూర్తి, వెంకటేశ్, శ్రీనివాస్, బోవి అభివృద్ధి మండలి చైర్మన్ రవికుమార్, మాజీ మంత్రి అరవింద లింబావళితోపాటు పలువురు స్వామీజీలు పాల్గొన్నారు.

నేడు 'అమరావతికి ఊపిరి' విజయోత్సవ సభ

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక తెలుగు ప్రజా సమితి ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరులో 'అమరావతికి ఊపిరి' పేరిట విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు బొందు రామస్వామి ప్రకటించారు. సభకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, రాష్ట్రమంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, భూమా అఖిల ప్రియ విచ్చేయనున్నారన్నారు. ఎంజీరోడ్డు అజంతా హోటల్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మంత్రి సవితమ్మను విజయవాడకు వెళ్లి ఆహ్వానించినట్టు సమితి ప్రధాన కార్య దర్శి బాబు రాజేంద్రకుమార్ తెలిపారు. ఆంధ్ర మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్‌తో పాటు జబర్దస్త్ కళాకారులు, ప్రజాగాయకుడు రమణ తదితరులు పాల్గొంటారన్నారు. న్యాయం గెలిచింది, నిజం గెలవాలి విజయోత్సవ సభ అమరావతికి ఊపిరి పేరిట ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.


మంత్రి సవితను ఆహ్వానిస్తున్న సంఘం పదాధికారులు

మద్య వ్యసన నియంత్రణ శిబిరాలు ప్రయోజనకరం


బసవకల్యాణమఠం స్వామిజీ మహదేవస్వామికి సన్మానం

శిడ్లఘట్ట, జూలై 20: ధర్మస్థళ ధర్మాధికారి వీరేంద్రహెగ్డే నేతృత్వంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో మద్యవ్యసన నియంత్రణ శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని వీటి ద్వారా లక్షలాది కుటుంబాలలో వెలుగు నింపుతున్నారని బసవకల్యాణ మఠం స్వామిజీ మహదేవస్వామి పేర్కొన్నారు. తాలూకాలోని హండిగనాళలోని కెంపణ్ణస్వామి వీరణ్ణస్వామి కల్యాణమండపంలో ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజనెకింద 1819వ మద్యనియంత్రణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మద్యవ్యసనం ద్వారా సమాజంలో లక్షలాది కుటుంబాలు దెబ్బతిన్నాయని, మహిళల జీవితాలు క్లిష్టంగా మారాయన్నారు. ఈ నేపథ్యంలో శిబిరాల ద్వారా మద్యవ్యసన నియంత్రణ శిబిరాలతో ప్రజలలో మార్పు తెస్తున్నారన్నారన్నారు. ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ శీనప్ప మాట్లాడుతూ సంస్థ సామాజిక, ఆర్థిక మార్పులు తేవడమే ఉద్దేశ్యమన్నారు. దురలవాట్లతో దెబ్బతిన్న సంసారాలలో మార్పు లు తెస్తున్నారన్నారు. స్థానిక ప్రముఖుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గంలోని వ్యక్తి కూడా ఉత్తమంగా సాగేలా శిబిరాలు సహాయకారిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జనజాగృతి వేదిక జిల్లాధ్యక్షుడు యళువళ్ళి రమేశ్, తాలూకా అధ్యక్షుడు త్యాగ రాజ్, వెంకటస్వామిరెడ్డి, హిత్తలహళ్ళి సురేశ్, రిటైర్డు ఐపీఎస్ అధికారి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నియంత్రణకు చర్యలు


డ్రమ్ములలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, జూలై 20: వర్షాకాలంలో వచ్చే డెంగీ జ్వరం నియంత్రణకు ప్రజలు తగిన అప్రమత్తంగా ఉండడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో స్వచ్ఛత ఉంచుకోవాలని మాజీ మంత్రి అరవింద లింబావళి సూచించారు. మహదేవపుర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. బైరతి వార్డులోని బైరతి బండె గ్రామంలో డెంగీ నియంత్రణా అభియానకు శ్రీకారం చుట్టారు. ఆరోగ్యశాఖ అధికారులు, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ అధికారులు, వలంటీర్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈడిస్ ఈజిప్ట్ దోమ ద్వారా డెంగీ జ్వరం ప్రబలుతుందన్నారు. ఈదోమ జీవితకాలం కేవలం ఒక నెలరోజులే అయినప్పటికీ ఐదారువందల నుంచి వేలసంఖ్యలో లార్వాల మాదిరిగా గుడ్లు పెడుతుందన్నారు. రోజుల తర బడి కూలర్‌లో నీరు నిల్వ ఉంచడం ద్వారా దోమలు ప్రబలే అవకాశం ఉందని, ఇంటి ప్రాంగణంలో పాత టైర్లు, టెంకాయ చిప్పలు, పాతపగిలిన సామగ్రిలలో నీరు ఉంటే తొలగించాలన్నారు. డ్రమ్ములు, ట్యాంకులు, సంపులను తరచుగా శుభ్రం చేసుకోవాలన్నారు. డెంగీ దోమ కరిస్తే వెంటనే లక్షణాలు కనిపించవని కొన్ని రోజుల తర్వాత ప్రభావం కనిపిస్తుందన్నారు. దోమ కరిచిన 3-5 రోజులకు జ్వరం తెలుస్తుందన్నారు. ఈ దోమలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా సంచరిస్తాయన్నారు. దోమతెరల వాడకం, ఇతరత్రా జాగ్రత్తలు పాటించడం ద్వారా జ్వరం బారిన పడకుండా ఉండవచ్చునన్నారు.

జాగ్రత్తలు పాటించండి

తీవ్రమైన జ్వరం, తలనొప్పి, చర్మంపై ఎరుపు గుల్లలు, కళ్లకింద నొప్పి, మోకాలి నొప్పి, కండరాల నొప్పి, వాపు, చిగుళ్లనుంచి రక్తకారడం వంటి లక్షణాలు డెంగీ జ్వరంగా భావించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో శరీరం పూర్తిగా కప్పి ఉండేలా బట్టలు ధరించడం, దోమతెరల వాడకం, చుట్టుపక్కల ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవడం, అనవసర వస్తువులు, కూలర్‌లలో రోజుల తరబడి నీరు నిల్వలేకుండా చూసుకోవడంతోపాటు డెంగీ లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలన్నారు. ఇదే సందర్భంగా డెంగీ నియంత్రణ వీలయ్యే దోమల నివారణ క్రీమ్‌లు, ఔషధాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ బీజేపీ అధ్యక్షుడు నటరాజ్, బీబీఎంపీ డీహెచ్‌ఓ లోకేశ్, ఎంఓహెచ్ రాకేశ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, అధికారులు ఈఈ రవికుమార్, ఏఇఇ శ్రీనివాస్, ఏఈ జగదీశ్, ప్రముఖులు రావాంజి, సతీశ్, మహేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యానిమేషన్ గ్రాఫిక్స్‌లో అపార ఉద్యోగావకాశాలు

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): డిజిటల్ యుగంలో యానిమేషన్, గ్రాఫిక్స్‌లో అపారమైన అవకాశాలు సాధ్యమవుతున్నాయని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస అభిప్రాయపడ్డారు. బసవనగుడి నేషనల్ కళాశాలలో బీఎస్‌సీ యానిమేషన్ కోర్సులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రీడీ, యానిమేషన్ గ్రాఫిక్స్ రంగంలో ఉత్తమసాధనలకు అవకాశాలు ఉన్నాయన్నారు. దైనందిన జీవితంలోనూ వీటిని చూడవచ్చునన్నారు. గతంలో మాదిరిగా కాకుండా సినిమా రంగంలోనూ ఆధునీకరణ పెరిగిందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ (ఎన్‌ఈఎస్) కర్ణాటక అధ్యక్షులు డాక్టర్ ఎన్ సుబ్రమణ్య, ఉపాధ్యక్షులు యాదాళం మధుసూదన్, కార్యదర్శి వెంకటశివారెడ్డి, అరుణ్‌కుమార్, ద్వారకనాథ్, సుధాకర్ ఎస్తూరి, కళాశాల చైర్మన్ రామమోహన్, ప్రిన్సిపాల్ రాధా వైసి కబళ, ప్రొఫెసర్ అలకానంద తదితరులు పాల్గొన్నారు.


యానిమేషన్ కోర్సుల ప్రారంభంలో ప్రముఖులు

కైవార సంగీతోత్సవంలో సందడి


భవ్యమంజునాథ్ బృందం భరతనాట్యం

చింతామణి, జూలై 20: తాలూకాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కైవార సద్గురు యోగినారేయణ మఠంలో సంగీతోత్సవంలో రెండోరోజు దూర ప్రాంతాలనుంచి భక్తులు తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. గురుపూజా సంగీతోత్సవంలో శనివారం సాగిన కార్యక్రమాలు సంగీతాభిమానులను అలరించాయి. ఉదయం నాదస్వర వాదన, డోలు వాద్యాలతో రెండోరోజు కార్యక్రమాలు అలరించాయి. మంజునాథ్ మాలూరు, డాక్టర్ ఎంవీ శ్రీనివాసమూర్తి, తిరుపతి బీ రఘునాథ్, కేఎస్ శ్వేతా, అశ్విని మోహన్, మరకతవల్లి, విష్ణు వెంకటేశ్, జీఎస్ బ్రహ్మేంద్ర, ఏవీ విశ్వనాథ్, కృష్ణ హోసూరు, లావణ్య రూపకళ, అపర్ణ కృష్ణకుమార్, మురళి, వానరాశి బాలకృష్ణ భాగవతర్ తదితరుల సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. సాయంత్రం ప్రత్యేక కార్యక్రమంలో చెన్నైకు చెందిన పద్మశ్రీ గ్రహీత కన్యాకుమారి ఫిడేలు వాదన, సీకే పతంజలి బృందం వేణుగానం, కేరళకు చెందిన సూర్య గ్రాయత్రి గాయనం, సిక్కిల్ గురుచరణ్ బృందం గాయనం, రుద్రాక్ష నాట్యాలయ బెంగళూరు బృందంచే భరతనాట్యం, చెన్నైకు చెందిన కేవీ ప్రసాద్, హరికుమార్, బెంగళూరు ప్రవీణ్ మృదంగ వాదన, డాక్టర్ విజయ్‌కార్తికేయన్, ప్రకాశ్ ఇళయరాజ, రంజిత్ వినాయక్, ముత్తుకుమార్, మల్లై కార్తికేయన్, వినోద్‌కుమార్ తదితరుల బృందంచే నాదస్వరం, డోలు వాదనలు ఆకట్టుకున్నాయి. పెద్దసంఖ్యలో జానపద కళాకారులు, కోలాటం, భజన, హరికథ, బుర్రకథ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంగీతోత్సవంలో పాల్గొన్న వేలసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదాసోహం నిర్వహించారు. ఆదివారంతో సంగీతోత్సవ కార్యక్రమాలు ముగియనున్నాయి.


పెద్దసంఖ్యలో పాల్గొన్న సభికులు

వైభవంగా ముత్తుమారియమ్మ ఉత్సవం

బెంగళూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నందిని లే అవుట్ కృష్ణానందనగర్‌లో శ్రీదేవి ముత్తుమారియమ్మ ఆలయం 43వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కరగ జాతర మహోత్సవం, కరగ అగ్నిగుండం వైభవంగా జరిగింది. ఐదు రోజుల ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి పూలకరగ ఊరేగింపు యశ్వంతపుర ప్రాంతంలో కొనసాగింది. రాత్రి 10 గంటలకు అగ్నిగుండంలో వందలాదిమంది భక్తులు నడిచివెళ్లారు. శనివారం ముత్యాలపల్లకీ ఉత్సవం కొనసాగింది.

ఉన్నత లక్ష్యంతోనే సాధన

బంగారపేట, జూలై 20: విద్యార్థి దశనుంచే ఉన్నత లక్ష్యం కలిగి ఉండడం ద్వారా జీవితంలో సాధన సాధ్యమని శనైశ్వర విద్యాసంస్థ సంయుక్త కార్యదర్శి సత్యభామ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని శనేశ్వర కన్నడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్యాట్ చంద్రణ్ణ స్మరణార్థం సంస్థ కార్యదర్శి సత్యభామ కుటుంబీకులు ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం అందచేశారు. ప్రధానోపాధ్యాయుడు హెచ్ఎల్ ఆనంద మాట్లాడుతూ దాతలు పాఠశాల తరగతి గదులను నిర్మించారని, 2009 నుంచి ప్రతి ఏటా పిల్లలకు ఉచిత యూనిఫాం అందిస్తున్నారని వారి సేవలు అభినందనీయమన్నారు. టీచర్ రంగణ్ణ మాట్లాడుతూ తాము చదివిన ప్రాథమిక పాఠశాలను మరవరాదని గ్రామీణ ప్రాంత విద్యార్థులు గుణాత్మక విద్యను అందుకుని ముందుకు సాగాల న్నారు. జిల్లా ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యా యుల సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్ అశ్వత్ మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, షూ, సాక్స్ ఇతర సౌలభ్యాలు ఉన్నాయని రానున్న రోజుల్లో మీరు కూడా దాతల వలే ఎదిగి ఇతర విద్యార్థులకు చేయూత ఇవ్వాలన్నారు. దాతలు రాఘవేంద్ర అభిషేక్ మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్, అబ్దుల్‌కలాం వంటి మహనీయుల తత్వ సిద్ధాంతాలను జీవనంలో అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో దాతలు నందిని, అరుణ్, అనర్ఘ, ఆకాంక్ష నాగేశ్, ఉపాధ్యాయబృందం గిరిజమ్మ, ఉషారాణి, చంద్రకళ, చందన పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

అగళి, జూలై 20: మండలంలోని రామనపల్లి వద్ద కరెంటు పోల్‌ను ఓ కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు చెందిన రాకేష్, శ్యామల శనివారం లేపాక్షిలోని దేవాలయం వెళ్లారు. అక్కడ దర్శనం అనంతరం హేమావతికి బయల్దేరారు. దారి తప్పి అగళి వైపు వస్తుండగా రామనపల్లి దగ్గర కారు వెనుక చక్రం పంచర్‌కావడంతో అతివేగంతో వెళ్లి 33కేవీ లైన్ పోల్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. గమనించిన స్థానికులు వీరిని శిరాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వివాహం నిశ్చయమైన నేపథ్యంలో ఆలయాల సందర్శనకు వెళుతూ బాధితులు ప్రమాదానికి గురైనట్లు తెలిసింది. వీఆర్ఓ వెంకటలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

అనంతపురం టౌన్, జూలై 20: ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన తహసీల్దారు సొంత ప్రాంతాలకు వచ్చేస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అప్పట్లో జిల్లా నుంచి ఇద్దరు మినహా.. 39 మంది తహసీల్దార్లు కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు వెళ్లారు. ఆ జిల్లాల నుంచి 39 మంది ఇక్కడికి వచ్చారు. సీఎం చంద్రబాబు తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రెవెన్యూశాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలోని 39 మంది తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టరు వినోద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో పొరుగు జిల్లాల నుంచి వచ్చినవారు ఒక్కొక్కరుగా రిలీవ్ అవుతున్నారు. వీరు సోమవారం తమ జిల్లాల కలెక్టరేట్‌లలో రిపోర్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.